క్లుప్తంగా

కుట్టుమిషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి



కుట్టుమిషన్ సెంటరు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కుట్టు మిషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఉంగుటూరు గ్రామానికి చెందిన బీసీ మహిళలు సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంగా వినతిపత్రం అందజేశారు. గతంలో ఇన్‌స్టెంటు కో ఆర్డినేటర్ రమ్య గ్రామానికి వచ్చి కుట్టు సెంటరు పెడతామని నమ్మపలికి ఇంతవరకు ఏర్పాటు చేయలేదని వారు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఎంపీడీవో రాజ్ మనోజు మాట్లాడుతూ ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆక్వా రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్

దెందులూరు: ఆక్వా రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ అన్నారు. సోమవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల్లో ఆక్వా రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ రైతులు గ్రామసభలకు హాజరై చెరువుల సర్వే నెంబరు విస్తీర్ణం ఆన్‌లైన్ వివరాలను పూర్తిస్థాయిలో నిర్ధారణ చేసుకోవాలన్నారు. రైతుల మేలు కోసం చేసే ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల అసిస్టెంట్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: సమస్యలు పరిష్కార సాధన కోసం నియోజకవర్గ వ్యాప్తంగా అంగన్‌వాడీలు సోమవారం జిల్లా కేంద్రమైన ఏలూరు తరలి వెళ్లారు. దెందులూరు, ఏలూరు రూరల్, పెదవేగి, పెదపాడు మండలాల్లో అంగన్‌వాడీలు సీఐటీయూ మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని ధర్నాకు మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీల సమస్యలు కూటమీ ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేసుకుంటూ ధర్నాకు వెళ్లారు. సోమవారం సాయంత్రం అంగన్‌వాడీలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్య పరిష్కారానికి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే ప్రణాళిక బద్ధంగా సీఐటీయూ సూచనలు సలహాలు మేరకు తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

అక్రమ చెరువు తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఎటువంటి అనుమతులు లేకుండా తమ గ్రామంలో పంచాయతీకి చెందిన పుట్టావారి చెరువు తవ్వేసి మట్టిని అమ్మేసుకుంటున్నారని రావులపర్రు గ్రామానికి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ విభాగం నాయకుడు గాధి వెంకటరమణ ఎంపీడీవో రాజ్‌మనోజుకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు తవ్వేస్తున్నా పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి విజయ్ పైన, తవ్వే వారిపైన చర్యలు తీసుకోవాలని రమణ పిర్యాదు చేశారు.

కంద్రికగూడెం పీడీగా కృష్ణారావు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కంద్రికగూడెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఎం కృష్ణారావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పోతునూరు నుంచి ఆయన సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు.

చెరువుల విస్తీర్ణం, సర్వే నంబర్లు సరిచూసుకోండి

దెందులూరు: ఆక్వా రైతులు తమ చెరువుల విస్తీర్ణం, సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో వివరాలను నిర్ధారించుకోవాలని మత్స్యశాఖ ఏలూరు ఎఫ్‌డీఓ సతీష్ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, కాట్లంపూడి, శ్రీపర్రు గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో ఆక్వా రైతులు ఉద్దేశించి ఎఫ్‌డీఓ సతీష్ మాట్లాడుతూ ఆక్వా జోనేషన్‌లో భాగంగా రైతులు ఒకటి రెండు సార్లు చెరువు విస్తీర్ణం, సర్వే నంబరు, ఆన్‌లైన్ ప్రక్రియను తనిఖీ చేసుకోవాల్సిన వ్యక్తిగత అవసరం రైతులపైనే ఉందని చెప్పారు. రైతులు సాగు ప్రక్రియలో మత్స్యశాఖ పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

ప్రయాణం.. భయం భయం

- పాతూరు అండర్ టన్నెల్‌లో భారీగా చేరిన వర్షపు నీరు
- బయటకు వెళ్లే మార్గం లేక నిండు కుండలా ఉన్న నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న జనం
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి



వర్షపు నీటితో నిండుకుండలా మారిన పాతూరు అండర్ టన్నెల్



భారీ వర్షపు నీటిని చూసి వెనక్కి వాహనాలు



గత్యంతరం లేక నీటిలో వెళ్తున్న ట్రాక్టర్లు

భీమడోలు: కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సూరప్పగూడెం పంచాయతీ పరిధిలో పాతూరు రైల్వే అండర్ ట్రన్నెల్ వర్షపు నీటితో నిండిపోయింది. ఆదివారం, సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో అండర్ ట్రన్నెల్‌లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిండుకుండలా ఉంది. మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనితో రాకపోకలు సాగించే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు, నిత్యం ఆ మార్గం ద్వారా వెళ్లే విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే వాహనాలు అండర్ ట్రన్నెల్ వరకు వెళ్లి.. ముందుకు వెళ్లే మార్గం లేక వెను తిరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీని వల్ల ప్రయాణభారం, అదనపు ఖర్చులతో తప్పని పరిస్థితుల్లో ద్విచక్రవాహనదారులు, రైతులు, ఆ నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దీనితో వాహనదారులు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. కొందరు ప్రమాదమని తెలిసిన రైల్వే ట్రాక్ దాటి రాకపోకలు సాగిస్తున్నారు. వాస్తవానికి జాతీయ, రాష్ట్రీయ రహదారులను అనుసంధానం చేయడంతో పాటు పాతూరు రైల్వే గేటును మూసివేసేందుకు ఇక్కడ అండర్ ట్రన్నెల్ నిర్మాణం చేపడుతున్నారు. ఇంకా నిర్మాణంలో ఉన్నప్పటికీ ఇప్పటికే ఈ మార్గం ద్వారానే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అయితే వర్షపు నీటికి బయటకు తోడే ఏర్పాట్లు చేపట్టకపోవడంతో నీరంతా వెళ్లే మార్గంలోనే భారీగా నిలిచిపోయింది. వర్షాకాలం వస్తే సూరప్పగూడెం వాహనాలు వేరే మార్గం వైపు వెళ్లాలని సూచిస్తూ సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెలగాలి



బదిలీపై వెళ్తున్న సీఐ సుభాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గణపవరం: పోలీసులు ప్రజలమధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటే సమాజంలో నేరసంస్కృతిని అదుపు చేయడం సులభ సాధ్యమవుతుందని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గణపవరం సీఐగా పనిచేసి బదిలీపై జంగారెడ్డిగూడెం వెళ్లిన సుభాష్‌ను సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మంచి సంబంధాలు ఉండటం ద్వారా గ్రామాలలో జరిగే కార్యకలాపాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. మూడున్నరేళ్లుగా తనకు సహకరించిన గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు ఎస్ఐలు మణికుమార్, వీరప్రసాద్, సూర్యభగవాన్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది, సచివాలయ రక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిన నేతలు



ఉంగుటూరు మండలం నుంచి వాసుబాబు ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న యువకులు

దెందులూరు: యువతకు ఇచ్చిన హామీలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి సోమవారం నియోజకవర్గస్థాయి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో యువత ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు యువత, విద్యార్థుల తరుపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందన్నారు. ప్రతినెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన యువతకిచ్చిన వాగ్దానం అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొత్తడి వేదకుమారి, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదవేగి ఎంపీపీ రమ్యశ్రీ, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ నీలిమ, ప్రజా ప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పోరుకు పోటెత్తిన యువకులు

ఉంగుటూరు: ఏలూరులో నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలు కల్పించక, నిరుద్యోగ భృతి ఇవ్వక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి నిరసనగా చేపట్టిన యువత పోరు బాట కార్యక్రమానికి ఉంగుటూరు నియోజకవర్గంనుంచి పెద్ద ఎత్తున యువకులు పార్టీ శ్రేణులు ఏలూరు తరలి వెళ్లారు. సోమవారం నియోజకవర్గం నాలుగు మండలాల భారీ సంఖ్యలో యువత తరలి వెళ్లారు. ఉంగుటూరు మండలం నారాయణపురం సెంటరుకు మండలంలోని యువకులు చేరుకుని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పుప్పాలవాసుబాబు భువనపల్లి నుంచి నారాయణపురం వచ్చాక ఆయనతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడమంగ రావు, భూత్ వింగు రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావుబాబ్జి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాలగోపి, ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారునాగరాజు, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండబాలకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కర్యాదర్శి మందజయలక్ష్మి, పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరణంబుజ్జి, వీవర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ తదితరులు తరలివెళ్లారు.

ఉప్పొంగిన ఉత్సాహం

భీమడోలు: ఏలూరులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి యువత ఉప్పొంగిన ఉత్సాహంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సోమవారం తరలివెళ్లారు. భారీ ర్యాలీ, ప్రదర్శనలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా.. జగనన్నకు జై జై నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం నుంచి భారీ ఎత్తున యువత ఏలూరుకు తరలి వెళ్లి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మద్దుల రాజా, ఎంపీపీ కనుమాల ఆదాం, సర్పంచ్ పాము సునీత, జిల్లా అధికార ప్రతినిధి ఇంజేటి నీలిమ, ఎంపీటీసీలు గంటా శ్రీను, ఆల్తి గోపి, ఇంజేటి జూనియర్, వివిధ అనుబంధ విభాగాల కన్వీనర్లు పాము మాన్‌సింగ్, పసుపులేటి సత్యనారాయణ, రామిశెట్టి శ్రీను, అంబటి నాగేంద్ర ప్రసాద్, చిట్టూరి సాయికృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి నాగేశ్వరరావు, గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ పచ్చా గోపి, నాయకులు ఎస్.గోవింద్, కె.రవికుమార్, ఆల్తి సురేష్, అడబాల నాగభూషణం పాల్గొన్నారు.



యువతపోరుకు తరలి వెళ్లిన మహిళా నాయకులు



యువతపోరులో పాల్గొన్న యువత



జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు

విద్యార్థులకు బహుమతుల అందజేత



కాగుపాడు హైస్కూలులో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు కాగుపాడు హైస్కూల్‌లో బహుమతులు అందజేశారు. సోమవారం కొరపాటి ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె మణికుమారి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ కడియాల రవిశంకర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ధనుకొండ ప్రేమ్‌కుమార్‌కు 5వేలు, ఉసురుమర్తి రేణుకాశ్రీకి 3వేలు, వెలగలపల్లి అనన్యగేస్‌కి రూ.2లు చొప్పున ప్రాత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణ్‌కుమార్, శీతాల సత్యనారాయణ, కొరపాటి వెంకటరావు, తదితరలు తల్లిదండ్రులు పాల్గొన్నారు. గుల్లపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు లవ్ ఇన్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అబ్నర్, గేస్ సంఘం పెద్దలు యోహాను, బాలక్రిష్ణ, అబ్బులు, సందీప్, లాస్య రాణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు లవ్ ఇన్ యాక్షన్ స్వచ్ఛంధ సంస్థ హోలీ ఫైర్ చర్చి తరఫున పుస్తకాలు,పెన్నులు, పెన్సిల్స్, బిస్కట్లు, చాక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాస్టర్ అబ్నర్ , గేస్ సంఘం పెద్దలు యోహను, బాలకృష్ణ, యేసు, అబ్బులు సందీప్ జగదీష్ లాస్య రాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నతానియేలు

దెందులూరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వ్యక్తులు కొనియాడారు. ప్రపంచ దేశాల మధ్య ఐక్యత స్నేహ భావం ఇంటిగ్రేట్ పెంపొందించడానికి ఒలింపిక్స్ ఎంతగానో ఉపయోగపడతాయని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నతానియేలు అన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల అందరికీ మంచి ఆరోగ్యం నాయకత్వ లక్షణాలు మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది డాక్టర్ దిలీప్ కుమార్ స్వామి, డాక్టర్ డి రత్నబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: నిడమర్రు మండలం నిడమర్రు సెక్షన్ పరిధిలో ఆర్‌డిడిఎస్ పనులు, కొత్త 33కేవి విద్యుత్ లైన్ పనులు చేయుట నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. పెదనింద్రకొలను, చిన నింద్ర కొలను, నిడమర్రు, గుణపర్రు, ఖంద్రిక, ఆముదాలపల్లి, తోకల పల్లి బైనేపల్లి, దేవర గోపవరం, అడవికొలను ఇందిరమ్మ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న ఎస్ఎంసీ స్కూల్ నుంచి సీతాపురం గ్రామం వరకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. ఎం. అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: ఉపాధ్యాయులు విద్యార్థుల నూరు శాతం హాజరు సాధించడం ముఖ్యమైన అంశమని దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. సోమవారం దెందులూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటవ తరగతి విద్యార్థుల నమోదు పెంపుదల సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు సంసిద్ధ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు అందరికీ తెలుగు, ఆంగ్ల, గణిత సబ్జెక్టులో కనీస సామర్థ్యాలు కలిగి ఉండేలా ఉపాధ్యాయులు క్షేత్రస్థాయి కృషి ప్రణాళిక అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయ్ కుమార్, జి శర్మ, శ్రీదేవి, సురేష్, ఇతర ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

‘అమ్మకు వందనం’ నగదుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

- విచారించిన విద్యాశాఖ అధికారి
- సమస్యను పరిష్కరించిన అధికారులు



భీమడోలులో ఫిర్యాదు చేసిన మహిళ నుంచి లేఖను స్వీకరిస్తున్న ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: భీమడోలు అరుంధతీ కాలనీకి చెందిన పాపట్ల రత్నబాబు, వాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, వారిలో పెద్ద కుమార్తె అక్షర ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. రెండవ కుమార్తె అనుశ్రీ భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటుంది. ఈ పథకంలో తమ ఇద్దరు కుమార్తెలకు నగదు జమ కాలేదని ఇటీవల తండ్రి పాపట్ల రత్నబాబు పీజీఆర్ఎస్‌లో ఈనెల 18వ తేదీన ఏలూరులోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారికి ఉన్నతాధికారులు ఓ మెసెజ్ రూపంలో లేఖను పంపారు. పెద్ద కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నందున ఇంటర్ బోర్డును సంప్రదించాలని తెలిపారు. రెండో కుమార్తె అనుశ్రీ భీమడోలు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నందున రూ.10,900లు నగదు జమ అయ్యాయని, మిగిలిన నగదు సమస్య పరిష్కారం కోసం మీ సచివాలయానికి గాని బ్యాంకు వెళ్లాలని సూచిస్తూ డీఈవో లేఖ పంపారు. దీనిపై భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు ఆ పాఠశాల హెచ్‌ఎం శేష పద్మజ సమక్షంలో విద్యార్థి తల్లి వాణిని సోమవారం పిలిపించి భీమడోలు ఉన్నత పాఠశాలలో విచారణ చేశారు. రెండో కుమార్తెకు కేవలం రూ.10,900లు నగదు మాత్రమే జమ అయ్యాయని, మిగిలిన సొమ్ము ఎప్పుడు జమ అవుతుందో చెప్పాలని తల్లి ఎంఈవో, హెచ్‌ఎంలను ప్రశ్నించింది. జూలై 5వ తేదీలోగా జమ అవుతుందని తెలిపారు.

పెదవేగి ఆయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం



ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పెదవేగి : పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని ఫ్యాక్టరీ రైతుల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెదవేగి ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఐదు మండలాలలో జోన్‌గా ఏర్పడిందని చెప్పారు. పామాయిల్ పంట విస్తీర్ణం పెరిగి సుమారు రెండు లక్షల టన్నులు ఎఫ్ఎఫ్‌బి వస్తుందన్నారు. 40 సంవత్సరాల నుంచి అభివృద్ధి చేసిన ఈ ఫ్యాక్టరీ పంట ఏరియాలను ప్రైవేటీకరిస్తున్నట్లు తెలిసిందని, ఆంధ్రరాష్ట్రంలో పామాయిల్ రైతులు అందరూ ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ రైతుల అసోసియేషన్ సభ్యులు బొబ్బా వీరరాఘవరావు, ఆలపాటి సత్యనారాయణ, గుర్రం మాధవరావు, రామకృష్ణ, ముత్యాల రాజేష్ ఉన్నారు.

దారి.. గుంతలుగా మారి



అధ్వానంగా ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయానికి వేళ్లే రహదారి

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయానికి వేళ్లే రహదారి బురదమయంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాన్ని ఆ రహదారిలో ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం మీదుగా నిత్యం ఎంతో మంది ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. చాలా చోట్ల గుంతలు పడి రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

శ్రీ కృష్ణుడిని జగద్గురువుగా పూజించాలి

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు అరుణ్ కుమార్



పెదకడిమిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : ఆషాడ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండుట వలన గురుపౌర్ణమి గా నిర్ణయించి సాక్షాత్తు శ్రీ కృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు సభ్యుల అరుణ్ కుమార్ తెలిపారు. జూలై 10వ తేదీన రాబోవు గురు పౌర్ణమి పండుగను పురస్కరించుని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక్ష నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు జిల్లా, పెదవేగి మండలంలోని పెదకడిమి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

ఏలూరు (టూటౌన్): భారతీయ జనసంఘ్, ప్రస్తుత బీజేపీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఆ పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. స్థానిక అశోక్‌నగర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆటోనగర్ అభివృద్ధికి పోరాటం

ఏలూరు (టూటౌన్): ఆటోనగర్ అభివృద్ధికి పోరాడతామని సీపీఐ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తెలిపారు. సోమవారం ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతూ మాగంటి నాగభూషణం చర్యలకు వ్యతిరేకంగా కమిటీకి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.